# పూలహారం

మామూలు పట్టణమే అది! అయినా ఇవాళ ప్రత్యేకం మాంచి రద్దీగానూ హడావిడిగానూ ఉంది. అందుకు కారణం లేకపోలేదు. ఇవాళా వూరికి ఓ గొప్పాయన వస్తున్నారు. గొప్పాయనే? ఆ వూరికే రావడమే? ఎందుకు? నీరా షాపుకి ప్రారంభోత్సవం చేస్తారా? బస ఎక్కడ? కంట్రాక్టుల ధర్మమా అని పసందైన మేడనీ పాంటియాక్కు కారునీ పది కంపెనీలలో షేర్లనీ కొనగలిగిన ధర్మారావుగారి యింట్లోనా? బహిరంగసభ ఎక్కడ? బాజాలు వినిపించవేం? అంటూ కంగారుగా అడిగేసెయ్యకండి.

అలా అడిగితే, ఆయన అసలా వూరు రావడంలేదనీ, ఏ ఊరో వెళుతూ అక్కడో పదినిముషాలపాటు, అదైనా స్టేషనుకి దగ్గర్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడ్డ వేదిక మీదకివచ్చి కనిపిస్తారనీ నిజం చెప్పాల్సి వస్తుంది. అవును! ప్రజాసేవా దురంధరుడైన ఆ గొప్ప నాయకునికి తీరిక

ఎక్కడ? అసలా ఊళ్ళో ఆ మాత్రమైనా ఆగడం అనేది మొదటి ప్రోగ్రాంలో లేదు తెల్సా?! ప్రజా ప్రతినిధి అయిన ధర్మారావుగారు మరీ మరీ టెలిగ్రాం అభ్యర్థనలూ హైదర్రాబాదు రాయబారులూ సాగించారు. కనుక ఆశ్రిత పక్షపాతి అయిన ఆ మహానాయకుడు ఎట్టకేలకు బ్రహ్మ ప్రళయం మీద సరే అని ఆ ఊరికి పదినిమిషాలు శాంక్షను చేశారట!

ఫలానా గొప్పాయన అక్కడ పదినిమిషాలు ఆగుతా డనేది చీకటి బజారులా చిటికెలో వ్యాపించి పోయింది. ఆ పట్టణంలోనే కాకుండా చుట్టు పక్కల పది పన్నెండూళ్ళలో కూడా ఇంక చూస్కోండి ఊరంతా జండాలా, ప్రతి వీధి లోనూ తోరణాలా ప్రతిజంక్షన్‌లోనూ ఆయన గుణగణాల్ని పొగిడే స్వాగత ద్వారాలా (ఆయన ఊళ్ళోకి వస్తాగా రారా ఇవన్నీ ఆయన చూస్తారా చూడరా అనేది వేరే విషయం) ప్రతి ముఖ్యమైన రోడ్డునీ ప్రత్యేకంగా తుడుపించ డాలా, అమాయకపు ప్రజలు అన్నాలు మానుకొని ఏడెనిమిదేసి మైళ్ళనుంచి ఎడ్లబళ్ళమీద వేంచేయడాలా, కార్యకర్తలు కాళ్ళూ చేతులూ విరగతొక్కు కోడాలా, చిల్లర నాయకుల చిటపట ఆర్భాటంలా జట్కాల చప్పుళ్ళూ, రిక్షాల గంటలు చిన్నకారుల, ఛీత్కారాలా-ఓ-మా చిత్రం వచ్చినట్లు, కోటి పల్లి తీర్థాన్ని మించి, కోటప్ప తిరనాళ్ళని మరిపించి, బతకమ్మ సంబరాన్ని బలాదూరుచేసి, గోలగా, గొడవగా, కోలాహలంగా మారిపోయింది పట్టణం తెల్లారే సరికి.

మహానాయకుడు ఇంకా రెండు గంటలకి వస్తారనగానే. స్టేషన్ రోడ్డుమీద ట్రాఫిక్ అంతా బంద్ చేసేశారు పోలీసు వాళ్లు. ఆ వ్యవహారాలన్నీ చూడడానికి ప్రత్యేకంగా ఓ సర్కిల్ ఇనస్పెక్టరుని కూడా వేశారు. తనజీపుని ఇటూ అటూ ఉరికిస్తూన్న ఆ ఇనస్పెక్టరు, మరీ ఏ ధర్మారావుగారి లాంటి ఏ ముగ్గురు నలుగురు ముఖ్యుల కార్లోతప్ప, ఇంకే లాంటి వాహనాల్నీ ఆ మార్గాన రానియ్యడం లేదు. మంచి అనువైనచోటు ఎక్కడ దొరకదో అని రెండు మూడు గంటల ముందునుంచే సామాన్య ప్రజానీకం అంతా తండోప తండాలుగా స్టేషన్ వెలుపల సిద్ధం చేసి రైలు దగ్గరికి పరిగెట్టారు. కళ్లుమూసి తెరిచేటంత సేపట్లో రైలునుంచి దిగిన ఓ ఇస్త్రీ మడతల ఆసామీని దండలతో ముక్కుదాకా మూసేసి, గబగబా స్టేషను అవతల ఉన్న వేదికదగ్గరికి తీసుకు పోయారు.

ఆయనే ఆ గొప్పాయన అయి ఉంటాడు. లేకపోతే ఎంతటి హేమా హేమీలనయినా ఆపుచేసేసి, ముక్కుమీద గుద్ది గేటుదగ్గర టిక్కెట్లు వసూలు చేసే ఆ తెల్లకోటు బాబు, ఈయన్ని సూడగానే దణ్ణంపెట్టి పక్కకెందుకు తప్పుకుంటాడు? మా బాగా అయింది తెల్లకోటు బాబుకి, తనని ఎన్నిమాట్లు తన్నాడు టిక్కెట్టులేదని!

కుంటాడికి గొప్పాయనంటే ఎంతో ఇష్టం అయిపోయింది. పాపం. మారాజుకు ముక్కుదాకా మూసేశారు దండలతో. గాలిపీల్చుకోవడం ఎలాగా? ఆయన్నిచూస్తుంటే కుంటాడికి ఉక్కిరి బిక్కిరిగా ఉంది. ఇంతలో వేదిక దగ్గరికి

వచ్చిన గొప్పాయన్ని చూసి మళ్ళీ జనం అంతా 'జై' అని అరిచారు. వేదిక మీదకి ఎక్కబోతున్న వాడల్లా వెనక్కి తిరిగి అందరికీ నమస్కారం చేశాడు గొప్పాయన. నిజంగా ఎంత గొప్పాయన! అనుకున్నాడు కుంటాడు. గొప్పాయన గొప్పతనం అంతటితో అయిపోలేదు. పక్కనే నిలబడ్డ తల్లి చేతుల్లో ఉండి బిత్తర చూపులు చూస్తూన్న ధర్మారావు గారి రెండేళ్ళ అమ్మాయి మెడలో దండ వేశాడు తన మెళ్ళో ఉన్నదొకటి తీసి, ఆ పసిపాప ఆ పూలహారాన్ని తాచుపాము అనుకుందో ఏమో, ఒక్కమారు కెవ్వున అరచి ఏడవడం ప్రారంభించింది.

గొప్పాయన, తన మెళ్ళో ఉన్న ఇంకో దండని తీసి జనం మధ్యకి విసిరాడు ఫల్లివిస్తరాకు కోసం ఎగబడ్డట్టు ఆ దండకోసం ఎగబడి, చివరకి, తలోకాస్త తెంపుకొని తృప్తిపడ్డారు జనం. ఆయన మరో దండని మరో పక్కకి విసిరాడు. అప్పుడూ అదే అల్లరి ఇలా ఒకొక్క దండా ఇటూఅటూ విసురుతూ ఆయనవినోదిస్తూంటే, 'హమ్మయ్య' ఇంక ఆయనకి ఊపిరి సలుపుతుంది ముక్కుని మూసేసిన దండలు పోయాయి' అనుకుంటూ తనకేదో భారం తీరినట్లు గట్టిగా శ్వాసతీసుకొని వదిలాడు కుంటాడు.

ఇంతలో ఉన్నట్టుండి ఓ దండవచ్చి సరిగ్గా కుంటాడి ఒళ్ళోనే పడింది. అది ఇంక పక్కనున్న వాళ్ళకి ఒక్క నూలువాసిఅయినా తగలలేదేమో దానిలో వాటా అడగడానికి వాళ్ళకెవరికీ వీలు లేకపోయింది. అందుకే వాళ్ళంతా కుంటాడికేసి ఫుల్తూ ఫుల్తూమంటూ చూశారు. కుంటాడికి

దాదాపు మతిపోయింది సంతోషంతో. ఘుమ్మని వాసనలు వెదజల్లుతూ అప్పటి కప్పుడు కట్టినట్లున్న ఆ అందమైన దండని చూసేసరికి, అసలే ఆకలితో నీరసంగా దడదడలాడుతున్న కుంటాడికి మరింతదడ బయలుదేరింది గుండెల్లో. వాడి బుర్ర మొద్దుబారిపోయి ఒక్క క్షణం పనిచెయ్యడం మానేసింది. అందుకే గొప్పాయన వేదికమీదకి ఎక్కి మైక్ బుగ్గమీదచిటికవేసి 'సోదర సోదరీమణులారా...' అంటూ ఏదో చెప్పబోతూంటే, వాడికేం అర్థం కావటంలేదు. మనస్సునిండా ఇదీఅని చెప్పలేని ఏదో ఆనందం మాత్రం నిండిఉంది. కాస్సేపయిన తర్వాతేనా గొప్పాయన చెబుతూన్న దేమిటో కుంటాడికి అర్థం అయిఉండును వాడు వినడం అంటూ జరిగితే! కాని ఆ ఉపన్యాసం వినడానికే వీలులేక పోయింది, వాడికి.

ఏమంటే-

సరిగ్గా మహానాయకుడటు దండలన్నీ ప్రజలకి దానం చేసేసి వేదికఎక్కుతుండగా, ఇటు రొప్పుతూ రోజుతూ సిల్కు బట్టల చిల్లర నాయకుడొకాయన చుట్టుతిరిగి చిల్లర ప్లాట్ఫారమ్మీదికివచ్చి, కుంటాడి చేతిలో పూలహారాన్ని చూసి "ఉళ్ళో ఎక్కడా లేంది నీ కెక్కడ వచ్చిందిరా, దండ!" అన్నాడు ఆశ్చర్యంగా, ఆయనలా అనడానికి కారణం ఉంది. ఏమంటే, మహానాయకుడికి వెయ్యడం కోసం అని దండ ఒకటి తెమ్మని పొద్దున్ననగా నౌకర్లని పంపాడు బజారుకి. ఏ కొట్లోనూ లేవు. అప్పటికే దండలూ పువ్వులూ అమ్ముడుపోయాయి, ఎప్పుడూ లేంది తను, కారువేసుకుని మరీ

తిరిగి వచ్చాడు. అన్ని పూల అంగళ్ళ దగ్గరికీ, ఎక్కడా
లాభం లేకపోయేసరికి సరే అక్కడ చూసుకోవచ్చు ఆలశ్యం
అయిపోతోందని, ఆదరాబాదరాగా కారు వేసుకు వచ్చే
శాడు. కాని కారు రావడానికి వీలులేకుండా జనం కిక్కిరిసి
కూర్చున్నారు. అందువల్ల కారుని ఏభై గజాలు అవతల
ఆపేసి ఇలా చుట్టూ తిరిగి స్టేషన్ లోంచి వేదికదగ్గరికి బయలు
దేరాడు, ఆయన ఆశ్చర్యం అంతా, తనకి దొరకని దండ
ఈ ముష్టి వెధవకి ఎలా దొరికింది అనే.

తన ఇందాకటి ప్రశ్నకి ముష్టాడు సమాధానం ఈయక
పోయేసరికి ఆ సిల్కు లాల్చీ నాయకుడు మళ్ళీ అడిగాడు
ఏరా అబ్బి? ఆ దండ ఎక్కడిది? నాకిస్తావా! అని,
అలా అడిగినప్పుడు వాడు కుంటి ముష్టాడు, తను
సిల్కు నాయకుడు. అనే తరతమ భేదాన్ని బహుశా మరచి,
గాంధీగారు ప్రబోధించిన విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని
మననం చేసుకొని ఉంటాడు. అందువల్లనే పెదిమలమీద
ఆ చిరు మందహాసం!

ఆయన వేసిన ప్రశ్నకి ఆ ముష్టాడు, ఉలిక్కిపడి ఆ
సిల్కు ఆయన ఎక్కడ లాగేసుకుంటాడో అని వెంటనే
ఆ దండని రెండు చేతులతోటి గట్టిగా గుండెల కదుము
కున్నాడు. ముష్టాడి ఆకారణ భయానికి నవ్వి కళ్ళజోడు సరి
చేసుకుంటూ "ఊరికేఅక్కర్లేదు లేరా-డబ్బులిస్తా" అన్నాడు
ఆయన.

'డబ్బు' అనేమాట వినిపించగానే ముష్టాడి మొహం చింకిచేటంత అయింది. వాడు ముసి ముసి నవ్వులు నవ్వసాగాడు.

సిల్కు నాయకుడికి విసుగేసింది వాడి నంగి నంగి వేషాలు చూసేసరికి. అందుకే అన్నాడు "నవ్వుతూ కూచుంటే కాదు. ఎంతకిస్తావో చప్పున చెప్పు. మళ్ళీ పది నిముషాలు దాటితే ఆయన వెళ్ళిపోతారు." అంటూ తొందరపడసాగాడు. ముష్టాడికేం తోచలేదు. మనస్సులో కొండంత సంతోషం మాత్రం ఉబికి వస్తోంది. తనకా దండ వల్ల కొంతడబ్బు రాబోతుందని, ఆయనంటూ అడక్కపోతే ఈ దండని తనేం చేసుకుంటాడు! కొరుక్కు తింటాడా? ఇదేవైనా కాయా పండా ఆకలి తీరడానికి! ఎంతకో అంతకి ఆయనకి ఇచ్చెయ్యడం మంచిది. కాని ఎంతకి? తనకిదాని ఖరీదు! తెలియదే!...ఎంతని అడగడం?...ఓపట్టాన ముష్టాడు తెముల్చుకోలేక పోతున్నాడు. ఆలోచనని - సిల్కు లాల్చి ఆయన ఇంక ఆలశ్యాన్ని భరించలేక "ఏటలా నీళ్ళునములుతావు?... ఇంతకీ ఇచ్చేబేరం కాదేమిటి?" అన్నాడు కొంచెం బెట్టుగా కాలు కదిపి వెళ్ళిపోబోతూ.

ముష్టాడు కళవళపడ్డాడు. "అమ్మకపోతే పోన్లే! అంటూ ఆయన వెళ్ళిపోతాడేమో తీరా. కాళ్ళదగ్గరకొచ్చిన అన్నాన్ని తన్ని పారేసుకుంటున్నట్లు అనిపించింది. వెంటనే కంగారుగా "ఎంతో అంత ఇప్పించండి" అన్నాడు. జాలిగా ఆయన హుందా అయిన మొహంలోకి చూస్తూ, సిల్కు

లాల్చీ ఆయన ఒక్క క్షణం ఆలోచించాడు. "మామూలుగా ఈ పూలహారం అయిదురూపాయలుండొచ్చు. ఇవాళ నాయకుడుగారు వచ్చిన గిరాకీవల్ల ఇంకో రెండో మూడో ఎక్కువుంటుంది. దండ అంటూ దొరికితే పది పదిహేను రూపాయలు ఇవ్వడానికైనా తను రెడీగా ఉన్నాడు ... అయితే అంతడబ్బు పువ్వులకొట్టువాడికి ఇయ్యడం వేరూ, ఈ ముష్టాడికి ఇవ్వడం వేరునూ, ఎందుకో అంతడబ్బు వాడికి ఇవ్వడానికి మనస్కరించలేదు ఆయనకి. అందుకే గడుసుతనంగా అన్నాడు. "ఎంతో అంత అని ఖాక్యంగా చెప్పలేకపోతే, ఇంతని స్పష్టంగా అఘోరించ కూడదూ?" అని.

ఆయనికి కోపం వచ్చిందని గ్రహించాడు ముష్టాడు. ఇంకా ఆలస్యం చేస్తే వెళ్ళిపోతాడేమో? దాంతో ముష్టాడి కళ్ళ ముందున్న అన్నపు పళ్ళెం కదిలి పోయినట్లనిపించింది. తను వెనకోమారు చిన్న పళ్ళెముడు అన్నమూ ఆరు అణాలకి కొనుక్కుని తిన్నాడు. ఇప్పుడా డబ్బులేకనుక తనచేతిలో ఉంటే, అలా అన్నం కొనుక్కు తినొచ్చు వెంటనే ఆకలితో కడుపు మండిపోతోంది. 'ఆ దండకి ఆరణాలివ్వండి' అని అడుగుదాం అనిపించి నోటిదాకా వచ్చీకూడా 'అర్ధరూపాయి ఇప్పించండి' అన్నాడు. అక్కర్లేదులే అని ఆయన ఎక్కడ వెళ్ళిపోతాడో అనేభయం ఓపక్క బితుకూ బితుకూ మంటూంటే.

సిల్కులాల్చీ పెద్దమనిషి విభ్రాంతుడయ్యాడు ఆ మాటవిని, తెల్లబోయి అలా ఉండిపోయాడు ఒక్క క్షణం. మళ్ళీ అంతలోనే సర్దుకుంటూ, తనలో తలెత్తిన ఆశ్చర్యం

బయటికి కనబడనీయకుండా వాళ్ళోమారు ఏగాదిగా చూసి "ఊ...సరే...ఇలా ఇయ్యి" అన్నాడు.

పూలహారం ముస్తాడి మురికి చేతుల్లోంచి ఆ పెద్ద మనిషి కరకమలాల్లోకి వెళ్ళింది. ఆయన వెంటనే పర్సు తీశాడు అందులో అన్నీ పెద్దనోట్లే కాని చిల్లర కనిపించ లేదు. "నీ దగ్గర అయిదు రూపాయలకి చిల్లరఉందా? అని అడిగాడు.

అంతే, చిల్లర తన దగ్గర లేనందుకు సిగ్గుపడి, చేత కాని నవ్వొకటి నవ్వాడు ముస్తాడు.

"మరి ఎలాగా?...నాదగ్గర చిల్లరలేదే!" అన్నాడు సిల్కు లాల్చీ ఆయన దిక్కులు చూస్తూ.

"అలా పళ్ళ దుకాణం దగ్గరకెళ్ళి మార్చుకొస్తాను ఇలా ఇవ్వండి" అన్నాడు ముస్తాడు.

కాని ఆ ముస్తాడిని నమ్మి అంత పెద్దనోటు వాడికివ్వ డానికి సందేహించాడాయన. అది పుచ్చుకొని వాడు ఉడా యిస్తే?...నిజమే!.

ముస్తాడిని ఆయన నమ్మలేదు.

కాని

వాడు మాత్రం ఆయనని నమ్మాడు.

అందుకే డబ్బు తర్వాతవచ్చి ఇస్తానంటూ హారాన్ని మాత్రం కంగారుగా పట్టుకుపోయి, నాయకుడి మెడలో అది అనుకున్న ప్రకారం వేసేసి, ఆయనని సాగనంపేసి,

తర్వాత జనం హడావిడీ, తన కారు ఎక్కడుందో చూసుకోవడం వీటితో. సిల్కులాల్చీ ఆయన నిమగ్నుడై పోయినా, గంటలు గంటలు గతించి కనుచీకటి పడిపోతున్నా; 'ఆయన వచ్చి అర్థరూపాయి ఇస్తారు. దాంతో అన్నం కొనుక్కో-వచ్చు. అనే ఆశతో, తన ఆకలి కన్నీళ్ళ మీద ఆశా సూర్యుడి కిరణాలు వాలిపోయి 'కలల ఇంద్రధనస్సులా ఇందాకటి పూలహారం క్షణ క్షణం జ్ఞప్తికివస్తూంటే' ఇంకా అక్కడే ఆమట్టునే కూచున్నాడు కుంటి ముష్టివాడు. నీరసంతో నరాలు తోడేస్తున్నా ఏలాగో ఓర్చుకుంటూ-